మేడారంలో ఎమ్మెల్యే దంపతుల పూజలు

సమ్మక్క సారలమ్మ సన్నిధిలో కోరం కనకయ్య,లక్ష్మి

టేకులపల్లి, జనవరి 21 : గిరిజనుల ఆరాధ్య దైవాలు మేడారం సమ్మక్క సారలమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే కోరం కనకయ్య దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమ్మక్క సారలమ్మ దయ నియోజకవర్గం ప్రజలపై ఉండాలని పూజలు చేసినట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, బయ్యారం పీఏసీఎస్ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి, వివిధ మండలాల నుంచి ముఖ్య నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఉద్యోగులు అధిక ఉత్పత్తికి కృషి చేయాలి

ఏరియా జీఎం జాన్ ఆనంద్

డ్రెస్ మెటిరియల్ పంపిణీ చేస్తున్న ఏరియా జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు రూరల్, జనవరి 21 : ఉద్యోగులు టీమ్ వర్క్‌గా పనిచేసి అధిక ఉత్పత్తికి కృషిచేయాలని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. అదివారం జీఎం కార్యాలయంలో వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2022-23 సంవత్సరానికి కేటాయించిన స్పోర్ట్స్ డ్రెస్ మెటీరియల్‌ను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం మల్లారపు మల్లయ్య, ఏజీఎం గిరిధర్‌రావు, డీజీఎం పర్సనల్ జీ.వి మోహన్‌రావు, అధికారులు ధనుంజయ్‌రెడ్డి, సాయి స్వరూప్, ఢిల్లీ శ్రీనివాస్‌రావు, బాలాజీ, ఉద్యోగులు పాల్గొన్నారు.

'ధాన్యం దొంగలు దొరికారు'

దుమ్ముగూడెం, జనవరి 21: ధాన్యం దొంగలు.. పోలీసులకు దొరికిపోయారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని వర్క్‌షాప్ గ్రామంలో రైతు తాటిపూడి రమేష్ పొలంలోని ధాన్యం బస్తాలను ఈ నెల 15న రాత్రి దొంగలు కాజేశారు. ఎస్సై, సిబ్బంది కలిసి శనివారం రాత్రి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో, వడ్ల బస్తాతో వెళ్తున్న వర్క్‌షాప్ గ్రామస్తుడు బొర్రా కార్తీక్ తీరు అనుమానాస్పదంగా ఉండడంతో ఎస్సై విచారించారు. వర్క్‌షాప్‌లో ధాన్యం బస్తాల చోరీ విషయాన్ని కార్తీక్ బయటపెట్టాడు. ఆ ధాన్యం బస్తాలను తనతోపాటు తమ గ్రామానికే చెందిన కల్లూరి జంపన్న, తుర్రం రమేష్, కల్లూరి సమ్మయ్య, సాయికృష్ణ కలిసి చోరీ చేసినట్లు వివరంగా చెప్పాడు. మండలంలోని లక్ష్మీనగరం, కేశవపట్నం గ్రామాల్లో ట్రాక్టర్‌ను, వరికోత మిషన్ల బ్యాటరీలను, మూడు బస్తాల వరి ధాన్యాన్ని, మోటర్ సైకిల్‌ను చోరీ చేసినట్లు వెల్లడించారు. కార్తీక్‌తోపాటు మిగతా వారిని ఎస్సై అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మోటర్ సైకిల్‌ను, బ్యాటరీలను స్వాధీనపర్చుకుని కేసు నమోదు చేశారు. వారిని కోర్టు ఆదేశంతో జైలుకు తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

టేకులపల్లి, జనవరి 21 : రెండురోజుల క్రితం పురుగుమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మండలంలోని మద్రాస్‌తండాలో ఆదివారం చోటు చేసుకున్నది. ఎస్సై గన్‌రెడ్డి రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మద్రాస్‌తండాకు చెందిన జర్పుల సురేశ్(25) ఈ నెల 19వ తేదీన మద్యం మత్తులో పురుగుమందు తాగిన సురేశ్‌ను కొత్తగూడెం ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. మృతుని భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

రేపు తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సమావేశం

బూర్గంపహాడ్, జనవరి 21: తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సమావేశం మంగళవారం ఉదయం 9 గంటలకు బూర్గంపహాడ్‌లో నిర్వహించనున్నట్లు బూర్గంపహాడ్ మండల ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు బాగి వెంకట్రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు మండలంలో అనేకమంది ఉద్యమకారులు పాల్గొన్నారని, ప్రభుత్వం వారిని గుర్తించి ఆదుకోవాలన్నారు. సమావేశానికి ఉద్యమంలో పాల్గొన్న వారు వారి వద్ద 2013కు ముందు ఉద్యమంలో పాల్గొన్న పేపర్ కటింగ్‌లతో పాటు ఏమైనా ఆధారాలు ఉంటే తీసుకుని ఆధార్‌కార్డు జిరాక్స్‌తో సమావేశానికి రావాలని కోరారు.

కలెక్టరేట్‌లో నేడు 'ప్రజావాణి'

కొత్తగూడెం టౌన్, జనవరి 21: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి ఉంటుందని కలెక్టర్ ప్రియాంక ఆల ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ వినతులను, ఫిర్యాదులను లిఖితపూర్వకంగా ఇవ్వవచ్చని పేర్కొన్నారు. ఉదయం 10:30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

EDUCATION

★Admissions: రెగ్యులర్ & డిస్టెన్స్; డిగ్రీ, PG, B.Tech, M.Tech, D-Pharma, B.Pharma, B.Sc. (Agri.), B.Sc. (Nursing), B.Ed, B.Ped, MBA, MCA. Eligible for all Jobs. Ph: 8866977112, 339.
NT-319803-All

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319418-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు
అత్యధిక ప్రచారం

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

పంట చేలు పెరగాలి ఓయమ్మలాలో..!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో యాసంగి పనులు జోరుగా సాగుతున్నాయి. అరకొర తప్ప చెరువులు, బోర్ల కింద ఇప్పటికే రైతులు వరి నాట్లు పూర్తయ్యాయి. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో చెరువులు, కుంటల్లో నీరు పుష్కలంగా ఉండడంతో సాగునీటికి ఢోకా లేకుండా పోయింది. రైతులు వరితోపాటు మిర్చి, బొబ్బర్లు, కంది, మినుము, మొక్కజొన్నలు సైతం పండిస్తున్నారు. వ్యవసాయ పనులతో సాగు క్షేత్రాలు కళకళలాడుతున్నాయి. ట్రాక్టర్ డ్రైవర్లు, కూలీలకు చేతినిండా ఉపాధి దొరుకుతున్నది. అశ్వారావుపేట, కరకగూడెం మండలాల్లో ఆదివారం ఈ సాగు పనుల దృశ్యాలు కనిపించాయి. 'నమస్తే' చిత్రాలను బంధించింది.

– అశ్వారావుపేట టౌన్/ కరకగూడెం, జనవరి 21

పేదలకు దుస్తుల పంపిణీ

మాట్లాడుతున్న సీఐ రాజగోపాల్

చర్ల, జనవరి 21: చర్ల మండలం రాళ్ళాపురం, తిమ్మిరిగూడెం, దుమ్ముగూడెం మండలం ములకనాపల్లి గ్రామాల్లోని దాదాపు 500 మంది పేదలకు దుస్తులను చర్ల సీఐ రాజగోపాల్ ఆదివారం పంపిణీ చేశారు. వీటిని కొత్తగూడెం శ్రీనివాస వస్త్రాలయం యజమాని మోరిశెట్టి భవానీప్రసాద్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సమకూర్చారు. చర్లలోని వనవాసీ కల్యాణ పరిషత్ కుమ్రం భీం విద్యార్థి నిలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పరిషత్ ప్రాంత కార్యదర్శి షహమీర్ శ్రీనివాస్, కొత్తగూడెం వాసవీక్లబ్ అధ్యక్షుడు గుబ్బా శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన క్రీడాకారులు రాణించాలి

ఏఎస్పీ పారితోష్ పంకజ్‌ను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

దుమ్ముగూడెం, జనవరి 21: గిరిజన క్రీడాకారులు రాణించాలని, తమ ప్రాంతానికి మంచి పేరు తేవాలని భద్రాచలం ఏఎస్పీ పారితోష్ పంకజ్ ఆకాంక్షించారు. మండలంలోని ములకపాడు పీహెచ్‌సీ మైదానంలో ఆదివారం పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆయనను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఎంపీపీ రేసు లక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు తెల్లం సీతమ్మ, మండల కార్యదర్శి కణితి రాముడు శాలువా కప్పి సత్కరించారు.

'పది' పరీక్షలపై అవగాహన

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జనవరి 21: పదోతరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలపై వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ వంగీపురం శ్రీనాథచారి ఆదివారం అవగాహన కల్పించారు. స్థానిక త్రివేణి పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యాసంస్థ అధినేతలు గొల్లపూడి వీరేంద్ర చౌదరి, మాచవరపు కోటేశ్వరరావు, పాఠశాల సీఏసీ నటరాజ్, సీఆర్‌వో కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్స్ వైవీ సురేష్, శ్రీనివాస్‌సింగ్, రాంమూర్తి, మంజుల పాల్గొన్నారు.

చిన్నారులకు ఆటల పోటీలు

పాల్వంచ, జనవరి 21: గణతంత్ర దినోత్సవం సందర్భంగా పదేళ్ల లోపు చిన్నారులకు నెహ్రూ నగర్ రాతి చెరువు కట్ట వద్ద ఆటల పోటీలను ఆదివారం మాలమహానాడు నిర్వహించింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి నాగేశ్వరరావు ప్రారంభించారు.

జీవిత బీమా సేవలు సద్వినియోగం చేసుకోవాలి

అశ్వాపురం, జనవరి 21: కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ బ్యాంకుల ద్వారా అతి తక్కువ ప్రీమియంకు అందిస్తున్న జీవిత బీమా సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మొండికుంట యూనియన్ బ్యాంకు మేనేజర్ మోహనరావు తెలిపారు. ఆదివారం మల్లెలమడుగు, రామచంద్రాపురం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్రలోభాగంగా జాతీయ బ్యాంకుల ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కేవలం రూ.436 వార్షిక ప్రీమియం ద్వారా 18-50 ఏళ్ల వారు ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన పథకం ద్వారా రూ.2లక్షలు జీవితబీమా, రూ.20 తక్కువ ప్రీమియంతో 18-70 ఏళ్లవారు రూ.2లక్షల ప్రమాదబీమా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ముస్కు శ్రీనివాసరెడ్డి, స్వర్గం బాలనర్సయ్య, మిలట్రీ వెంకన్న, ఆవుల రవి, తూము పెదరాఘవులు, భిక్షం రెడ్డి, వీవో సీసీ శోభ, డ్వాక్రా మహిళలు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లెనిన్ మార్గంలో ముందుకు సాగాలి

మణుగూరుటౌన్, జనవరి 21: లెనిన్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గద్దల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మణుగూరు శ్రామిక భవన్‌లో లెనిన్ వర్ధంతి సభను నిర్వహించారు. నాయకులు రేపాకుల శ్రీనివాస్, కొడిశాల రాములు, సత్రపల్లి సాంబశివరావు, దామల్ల లెనిన్ బాబు, సూర్యనారాయణ, శ్రీకాంత్, దేవేందర్, సందీప్ పాల్గొన్నారు.

సారపాకలో..

సారపాక, జనవరి 21: లెనిన్ సిద్ధాంతం ఎంతో గొప్పదని సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం లెనిన్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. ఆబిదా, కనకం వెంకటేశ్వర్లు, హుస్సేన్, కౌవులూరి నాగమణి, కమటం మరియమ్మ, ఆర్ లక్ష్మి, నిమ్మకాయల లక్ష్మి, ఈర్ల శివ, చంద్ర శ్రీదేవి, నూర్జహాన్, నిలోఫర్, సీత పాల్గొన్నారు.

జడ్జీలు, న్యాయవాదుల ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

రామవరం, జనవరి 21: రుద్రంపూర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లో ఆదివారం జిల్లా న్యాయమూర్తులు, న్యాయవాదుల ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ జరిగింది. దీనిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత్ పాటిల్ ప్రారంభించారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి భానుమతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్, సింగరేణి యాక్టింగ్ జీఎం రవీందర్, జీకేవోసీ పీవో శ్రీరమేష్, పర్సనల్ మేనేజర్ శివకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

కికెట్ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి

కాంగ్రెస్ హామీలు వెంటనే అమలు చేయాలి

టేకులపల్లి, జనవరి 21 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సేవాలాల్ సేన కోర్ ప్రణాళిక కమిటీ చైర్మన్ దరావాత్ ప్రేమ్‌చంద్‌నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సురేశ్‌నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బానోత్ హుస్సేన్‌నాయక్, బానోత్ బోజ్యానాయక్, బర్మావత్ హరినాయక్, మంగీలాల్, రామచంద్రనాయక్ పాల్గొన్నారు.

బిల్లుడుగూడెం గ్రామానికి రోడ్డు మంజూరు

గిరిజనులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట రూరల్, జనవరి 21 : గిరిజనుల గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడడంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండలంలోని బిల్లుడుగూడెం గిరిజన గ్రామాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు మౌలిక సదుపాయాలైన తాగునీటికోసం మినీ ట్యాంక్, విద్యుత్ సదుపాయం, లిఫ్టు పథకం, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులతో రహదారి మంజూరైనట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. కాంగ్రెస్ నాయకులు చెన్నకేశవరావు, ప్రమోద్, శ్రీనివాసరావురాజు, మనుగొండ వెంకటేశ్వరరావు. సంగా దుర్గరావు, గ్రామస్తులు అనిగే ముత్యాలు, జెట్టి వెంకటేశ్వరావు, కాంట్రాక్టర్లు రాజు, నరేశ్ పాల్గొన్నారు.

ఓటు నమోదు దరఖాస్తుల స్వీకరణ

అశ్వారావుపేట టౌన్, జనవరి 21 : ఓటు నమోదు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం రెండోవ రోజు ఆదివారం కొనసాగింది. స్థానిక ఉన్నత పాఠశాల పోలింగ్ బూత్‌లతోపాటు మండలంలోని పోలింగ్ స్టేషన్‌లలో 18 సంవత్సరాలు నిండిన యువత నుంచి ఓటు హక్కు కోసం దరఖాస్తులు స్వీకరించారు.

భవననిర్మాణ కార్మికులకు వైద్య పరీక్షలు

చండ్రుగొండ, జనవరి 21 : భవన నిర్మాణరంగంలో పనిచేస్తున్న కార్మికుల కోసం ఆదివారం చండ్రుగొండ పంచాయతీ కార్యాలయంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు హెల్త్ కోఆర్డినేటర్ మహేశ్ తెలిపారు. మండలంలో పనిచేస్తూ, హెల్త్‌కార్డు ఉన్నవారందరికీ వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణరంగం కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ ఎన్నిక

నూతన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం బాధ్యులు

చండ్రుగొండ, జనవరి 21 : ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఆదివారం సంఘం మండల సమావేశంలో నూతన మండల అధ్యక్షునిగా పుసుమర్తి శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శిగా కొదుమూరి జనార్దన్‌రావు, కోశాధికారిగా దూపకుంట్ల రామారావు, ఉపాధ్యక్షునిగా లగడపాటి వెంకటరంగారావు, సభ్యులుగా కొండా సతీశ్, మోటమర్రి కాంతారావు, కంచర్ల కృష్ణప్రసాద్, లగడపాటి నాగేశ్వరరావు, వనమా సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చండ్రుగొండ గ్రామశాఖ అధ్యక్షునిగా సంకా శంకర్, వైస్ ప్రెసిడెంట్‌గా కుక్కడపు వెంకటేశ్వరరావు, కోశాధికారిగా పద్మనాభుని క్రిష్ణరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల కమిటీ బాధ్యులు ప్రకటించారు.

సత్తుపల్లి ఎమ్మెల్యేకు సన్మానం

ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

రామవరం, జనవరి 21: సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయిని సింగరేణి ఐఎన్‌టీయూసీ నాయకులు ఆదివారం సత్తుపల్లిలోని ఆమె క్యాంప్ కార్యాలయంలో సన్మానించారు. సింగరేణి ఉద్యోగుల సమస్యలను వివరించి, పరిష్కరించాలని కోరారు. చెన్న కేశవరావు, అజయ్, చాంద్, రామస్వామి, క్రాంతికుమార్, నగేష్ పాల్గొన్నారు.

మొక్కల వెంకటయ్యకు పుత్ర వియోగం

వెంకటయ్యను పరామర్శిస్తున్న ప్రముఖులు

రామవరం, జనవరి 21: ప్రముఖ పర్యావరణ వేత్త, కొత్తగూడెం మున్సిపల్ గ్రీన్ అంబాసిడర్, సింగరేణి విశ్రాంత అధికారి మొక్కల వెంకటయ్య కుమారుడు సాయి నగేష్ కుమార్(45) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. కొత్తగూడెం ఎస్సీబీ నగర్‌లోని వెంకటయ్య ఇంటి వద్ద విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని ప్రముఖులు, నాయకులు సందర్శించి నివాళులర్పించారు. వెంకటయ్య-లక్ష్మి దంపతులను పరామర్శించారు. వీరిలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంగం వెంకటపుల్లయ్య, డీపీఆర్‌వో శీలం శ్రీనివాస్, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ సముజ్వల , ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సమున్నత, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ తెలంగాణ సహాయ అధికారి కోటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకుడు జేబీ శౌరి, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, ఎంఎల్ పార్టీ నాయకుడు అప్పారావు, కవి-రచయిత, బల్లెం సామ్యూల్, సింగరేణి ఏజీఎం గోనె శ్రీకాంత్, డీజీఎం చంద్రశేఖర్, తెలంగాణ టుడే ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జ్ జేమ్సే అడ్విన్, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వార్డు కౌన్సిలర్ కూరపాటి విజయలక్ష్మి, బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు, ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లా తదితరులు ఉన్నారు.

నేడు రామాలయంలో ప్రత్యేక పూజలు

స్వామివారిని ఊరేగింపుగా రామాలయానికి తీసుకొస్తున్న అర్చకులు

భద్రాచలం, జనవరి 21 : అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుపుతున్నారు. ఇందులో భాగంగా ఆలయ ప్రాంగణాన్ని, గర్భాలయాన్ని సిబ్బంది పూలతో ఆదివారం అలంకరించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు భక్తులకు బెల్లంతో చేసిన పొంగలిని పంపిణీ చేశారు. ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకీలో ఊరేగించి, ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా శోభాయాత్ర

ములకలపల్లి, జనవరి 21 : అయోధ్యలో సోమవారం బాలరాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ముందురోజు మండల కేంద్రమైన ములకలపల్లిలో శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర నిర్వాహకులు ఆదివారం వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో సీతారాముల ఉత్సవమూర్తులను ఉంచి గ్రామ పురవీధుల్లో కలియతిరిగారు. కార్యక్రమంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర నిర్వాహకులతో పాటు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.